నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 30 డిసెంబర్ 2023 | NIZAMABAD

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వేల్పూర్‌లోని తన నివాసంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పచ్చలనడ్కుడ ముదిరాజ్ సంఘ సభ్యులు సన్మానించారు.
-వేల్పూర్, డిసెంబర్ 29

రహదారిని కమ్మేసిన పొగమంచు

కమ్మేసిన పొగమంచు

వాహనదారులకు ఇబ్బందులు

డోంగ్లీ, డిసెంబర్ 29: ఉమ్మడి జిల్లాలో కొన్ని రోజులుగా దట్టమైన పొగమంచు కమ్ముకుంటున్నది. పల్లెలతోపాటు పట్టణాల్లోనూ ఉదయం వేళ మంచుదుప్పటి కప్పుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం కామారెడ్డి జిల్లాలోని డోంగ్లీ, మెనూర్, కుర్లా, ఖత్‌గావ్, లింబుర్ రహదారులపై పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఎనిమిది గంటల వరకు ఇదే పరిస్థితి ఉండడంతో వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. దట్టమైన పొగ మంచు ఏర్పడడంతో కొందరు సెల్ఫీలు తీసుకోగా.. మరికొందరు రహదారి పక్కన చలి మంటలు వేసుకున్నారు.

రెండో రోజూ తీరు మారలేదు

- పర్యవేక్షణ మరిచిన స్పెషల్ ఆఫీసర్లు
- ఉన్నత స్థాయి తనిఖీలు సైతం శూన్యం
- పలు చోట్ల దరఖాస్తుదారులకు కొర్రీలు
- రేషన్ కార్డుల కోసం భారీగా దరఖాస్తులు

క్షేత్ర స్థాయిలో అయోమయమే

బోధన్‌లో దరఖాస్తు ఫారాలను విక్రయిస్తున్న ఓ జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు

దరఖాస్తు ఫారం @ 50

రెండో రోజూ ఫారాల కొరత..

జిరాక్స్ సెంటర్లలో విక్రయం

శక్కర్‌నగర్, డిసెంబర్ 29 : బోధన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రెండో రోజూ ప్రజాపాలన దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. దీంతో జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాలకు అనుకూలంగా మారింది. దరఖాస్తు ఫారాల కలర్ జిరాక్స్‌ను ఒక్కొక్కటి రూ. 50 చొప్పున విక్రయించారు. కలర్ జిరాక్స్‌లు అవసరం లేదని చెబుతున్నా.. కొందరు బయట మాత్రం కలర్ జిరాక్స్‌లే కావాలని ప్రచారం చేయడంతో జిరాక్స్ సెంటర్లు, మీ సేవ కేంద్రాల వద్ద రూ.50 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అయితే, అధికారులు మాత్రం కలర్ జిరాక్స్ పత్రాలు అవసరం లేదని.. తామే ఫారాలను ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టామని, ప్రజలు ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని అంటున్నారు.

నిజామాబాద్, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజా పాలన అభయ హస్తం పథకాల కోసం ప్రజల నుంచి తీసుకుంటున్న దరఖాస్తుల్లో రెండో రోజు అదే అయోమయం చోటు చేసుకున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీగా జనం కౌంటర్లకు తరలివస్తున్నప్పటికీ ఏదో తెలియని భయం మాత్రం వెంటాడుతున్నది. కొత్త పథకాలు రావాలంటే అవస్థలు పడాల్సిందేనా? అనుకుంటూ జనం నిట్టూరుస్తున్నారు. తెలంగాణ సీఎం, ఇతర మంత్రులంతా కలిసి స్పష్టమైన ఆదేశాలను జారీ చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ స్థాయిలో ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదు. కౌంటర్లను ఏర్పాటు చేసినప్పటికీ దరఖాస్తు ఫారాల విషయంలో అస్పష్టతతో సిబ్బంది కొట్టుమిట్టాడుతున్నారు. సిబ్బంది తీరుతో జనం తికమక పడాల్సిన దుస్థితి ఎదురైంది. మాక్లూర్ మండలంలోని అనేక గ్రామాల్లో రెండో రోజు దరఖాస్తుల స్వీకరణలో ప్రజలంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దరఖాస్తులను జిరాక్స్ తీసుకుని వివరాలు నమోదు చేసుకొని కౌంటర్లకు వెళ్తే ద్వంద్వ సమాధానాలు ఎదురవ్వడంతో ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. దరఖాస్తులు బయటవి తీసుకోమంటూ చాలా మంది చెప్పడంతో విస్మయం వ్యక్తమైంది. మేమిచ్చే దరఖాస్తులే నింపాలంటూ గ్రామ పంచాయతీల్లో సిబ్బంది చెప్పడంతో జనం తిరుగుముఖం పట్టాల్సి వస్తోంది.

నిజామాబాద్ నగరంలోని ఓ కేంద్రం వద్ద ప్రజాపాలన దరఖాస్తులను సమర్పించేందుకు బారులు తీరిన మహిళలు

ఆదేశాలకే సరి...

ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియలో ఉన్నతాధికారుల తీరు కేవలం ఆదేశాలకు పరిమితం అవుతున్నది. కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు వేర్వేరుగా సమీక్షలు నిర్వహించి తమ సిబ్బందికి జాగ్రత్తలు చెప్పారు. అయినప్పటికీ కింది స్థాయిలో ఫలితాలు రాకపోగా తీవ్ర గందరగోళం ఏర్పడుతున్నది. మిగిలిన జిల్లాల్లో సవ్యంగానే పరిస్థితులున్నప్పటికీ నిజామాబాద్ జిల్లాలో పరిస్థితి ఘోరంగా మారింది. కౌంటర్లను తనిఖీ చేయడంలోనూ నిర్లిప్తత ఎదురవుతున్నది. దరఖాస్తులను పుష్కలంగా అందుబాటులో పెట్టామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ సిబ్బంది మాత్రం అందుకు విరుద్ధమైన ప్రకటలను పలు చోట్ల చేస్తుండడంతో సమాచార మార్పిడి అన్నది క్షేత్ర స్థాయికి సరిగా వెళ్లడం లేదని అర్థం అవుతున్నది. అభయహస్తం పథకాలకు దరఖాస్తులు చేస్తున్న వారంతా రెండో రోజు కూడా రేషన్ కార్డుల కోసమే భారీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఇక వేరే గ్రామాల్లో వలస వెళ్లి జీవనోపాధి పొందుతున్న వారు కూడా కూలీ పనులను వదులుకొని గ్రామాలకు రావాల్సి వస్తున్నది.

పత్తాలేని స్పెషల్ ఆఫీసర్లు..

మండలాలకు నియమించిన స్పెషల్ ఆఫీసర్ల పనితీరుపై ఉన్నతాధికారులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నట్లు తెలుస్తున్నది. మండలాల్లోనే తిష్ట వేసుకుని ఉంటూ ప్రజల ఇబ్బందులు దూరం చేసేందుకు సమన్వయం చేయాల్సిన ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు పత్తా లేకుండా పోయినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలోనే దరఖాస్తుల ప్రక్రియ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఈ తంతును వారంతా పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నారు.

దీంతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు చెప్పే సూచనలు, సలహాలు ఏవీ కూడా పకడ్బందీగా కింది స్థాయిలో మండలాధికారులకు చేరడం లేదు. దీంతో సందిగ్ధత ఏర్పడుతున్నదని తెలుస్తున్నది. స్పెషల్ ఆఫీసర్లపై ఉన్నతాధికారులు సరైన రీతిలో నియంత్రణ చేయకపోవడంతో ఇతర జిల్లాల నుంచి వచ్చి పోయే కొంత మంది అధికారులైతే ఈ కార్యక్రమాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల ఖర్చు వివరాలను గడువులోపు సమర్పించాలి

స్పందించని వారికి నోటీసులు జారీచేస్తాం..

నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 29 : ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో జిల్లాలోని ఆయా సెగ్మెంట్ల నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. శుక్రవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చుకు సంబంధించి వివరాలను ఎన్నికల ఫలితాలు ప్రకటించబడిన 30 రోజుల్లోపు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గడువు ముగియనున్న నేపథ్యంలో రీకన్సీలేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బ్యానర్లు, పోస్టర్, దినపత్రికలు, టీవీ చానళ్లలో ఇచ్చిన యాడ్స్, వాటికైన ఖర్చుల వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. అభ్యర్థులు వారి ఏజెంట్లకు సరైన రీతిలో ఖర్చుల వివరాలను సమర్పించేలా ఏఈవోలు మార్గనిర్దేశం చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ఖర్చులకు సంబంధించిన వివరాలను సకాలంలో నిర్ణీత పద్ధతిలో సమర్పించని పక్షంలో అలాంటి వారికి నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. నిర్ణీత కాల వ్యవధిలోపు స్పందించని వారిపై అనర్హత విధించాలని కోరుతూ ఎలక్షన్ కమిషన్‌కు లేఖ పంపిస్తామని పేర్కొన్నారు. ఈసీ ద్వారా అనర్హులుగా ప్రకటించబడిన వారు మూడేండ్ల వరకు ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం కోల్పోతారని తెలిపారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు శక్తి పాటిల్ చిన్మయి ప్రభాకర్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

పీసీబీ ఇంజినీర్‌కు నాలుగేండ్ల కఠిన జైలుశిక్ష

- రూ.50 వేలు జరిమానా విధింపు

నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 29 : నిజామాబాద్ జిల్లాలో 13 ఏండ్ల క్రితం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకొని ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఇంజినీర్‌కు నాలుగేండ్ల కఠిన జైలుశిక్షతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ ఏసీబీ ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన హరీశ్‌కుమార్.. ఆగ్రోమిల్ ఏర్పాటు చేసేందుకు లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ఫైల్‌ను పైఅధికారులకు పంపేందుకు 2010లో నిజామాబాద్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించిన చంద్రకాంత్ నాయక్‌ను ఆశ్రయించాడు. తనకు రూ.75 వేలు లంచం ఇవ్వాలని సదరు ఇంజినీర్ డిమాండ్ చేయగా.. చివరకు రూ. 50 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు దరఖాస్తుదారుడు హరీశ్‌కుమార్ మొదటి విడుతగా రూ.25 వేలు చంద్రకాంత్‌నాయక్‌కు అందజేస్తుండగా.. అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిశోర్‌కుమార్ సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా .. పరిశీలించిన ప్రత్యేకకోర్టు న్యాయమూర్తి కుమార్ వివేక్ నేరస్తుడికి నాలుగేండ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.50 వేలు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

వరినారు ఫర్ సేల్!

జిల్లాలో యాసంగి సాగు పనులు జోరందుకున్నాయి. ఎక్కడా చూసినా పొలం పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పలు మండలాల్లో అన్నదాతలు ముందుగా సిద్ధం చేసుకొన్న వరినారుతో నాట్లు వేస్తుండగా..మరికొందరు నందిపేట మండలం నుంచి నారును కొనుగోలు చేస్తున్నారు. నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఓ రైతు ఎకరానికి వెయ్యిరూపాయల చొప్పున నారు కొనుగోలు చేసి తన పొలంలో కూలీలతో నాట్లు వేస్తుండడం కనిపించింది.
-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కోతుల భయంతో..

మెట్లపై నుంచి కింద పడి ఒకరి మృతి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 29: కోతుల భయంతో ఆదరబాదరగా మెట్లు దిగుతూ జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జాన్కంపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమని శ్వేత.. దుస్తులు ఆరవేయడానికి శుక్రవారం ఇంటి పైకి వెళ్లింది. అక్కడ గుంపుగా ఉన్న కోతులు ఒక్కసారిగా మీదికి రావడంతో బెదిరిపోయిన శ్వేత ఆదరబాదరగా మెట్లు దిగుతుండగా జారి పడిపోయింది. తలకు బలమైన గాయాలు కావడంతో ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. శ్వేతకు భర్త శ్రీనివాస్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇద్దరు చిన్నారులు తల్లి లేని పిల్లలు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పెండింగ్ చలాన్లను సులభంగా కట్టుకోవచ్చు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

కామారెడ్డి కోర్టు ప్రాంగణంలో చెల్లింపు కౌంటర్ ప్రారంభం

ట్రాఫిక్ చలాన్ల చెల్లింపు కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్ శ్రీదేవి

కామారెడ్డి, డిసెంబర్ 29 : లోక్ అదాలత్ సందర్భంగా కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో ట్రాఫిక్ చలాన్ల చెల్లింపు కౌంటర్‌ను శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పెండింగ్ చలాన్ల డబ్బులు ఇక్కడ సులభంగా, తగ్గింపు ధరలో చెల్లించుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర పోలీసు శాఖ ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు 20శాతం, తోపుడు బండ్లకు పదిశాతం, కార్లు, హెవీ వెహికిల్స్‌కు 40శాతం చెల్లింపు కోసం జీవో జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గౌడ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజగోపాల్‌గౌడ్, అశోక్, నంద రమేశ్, దామోదర్ రెడ్డి,న్యాయవాదులు సిద్ధరాములు, నర్సింహారెడ్డి, న్యాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భుజంగరావు, కోర్టు సూపరింటెండెంట్లు వెంకట్ రెడ్డి, శ్రీధర్, చంద్రసేనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందూరు యువత వార్షికోత్సవంలో పాల్గొన్న ఎంపీ,ఎమ్మెల్యేలు

ఘనంగా 'ఇందూరు యువత' వార్షికోత్సవం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 29: ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఇందూరు యువత 12వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ అర్వింద్, అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పైడి రాకేశ్‌రెడ్డితోపాటు జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ హాజరయ్యారు. ఇందూరు యువత సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. అనంతరం పలు విద్యా సంస్థల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

జిల్లా కేంద్రానికి చెందిన సాయి దేవిక అనారోగ్యంతో బాధపడుతుండడంతో బాధిత కుటుంబానికి రూ.45వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, దారం గంగాధర్, ప్రవంతి రెడ్డి, సాయితేజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కూతురు వివాహ విషయం భార్య చెప్పలేదని మనస్తాపం

చికిత్స పొందుతున్న బాధితుడు

ఖిల్లీవాడి (మోపాల్), డిసెంబర్ 29 : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పోలీసు స్టేషన్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్ మండలంలోని సింగంపల్లి గ్రామనికి చెందిన రాజుకు కామారెడ్డి జిల్లా బీబీపేట్‌కు చెందిన మహిళతో వివాహం అయ్యింది. వీరికి ఒక కూతురు ఉంది. నాలుగు సంవత్సరాలుగా మనస్పర్థలతో భార్య బీబీపేట్‌లోని తల్లిగారి ఇంట్లోనే ఉంటుంది. కాగా శుక్రవారం కూతురు వివాహాన్ని భర్త రాజుకు చెప్పకుండా చేయడంతో మనస్తాపం చెందిన రాజు.. మోపాల్ పోలీస్ స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు మంటలు ఆర్పి జిల్లా కేంద్ర దవాఖానకు తరలించారు. 40 శాతం గాయాలయ్యాయని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల దుర్మరణం

నిజాంసాగర్, డిసెంబర్ 29 : రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం పిట్లం చౌరస్తా ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాగల్‌గావ్ గ్రామానికి చెందిన అన్నదమ్ములు వాగ్మారే గణేశ్(28), వాగ్మారే సంగ్రామ్ (35) మరో మిత్రుడు గైక్వాడ్ మదన్‌తో కలిసి పని నిమిత్తం బైక్‌పై మెదక్ జిల్లా కౌడిపల్లికి బయల్దేరారు. వీరి వాహనం పిట్లం చౌరస్తా వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టింది. గణేశ్, సంగ్రామ్ అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మదన్‌ను చికిత్స నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు